23)రామక్రియ/హిందోళం

ప|| కట్టెదుర వైకుంఠము కాణాచయిన కొండ| తెట్టలాయ మహిమలే తిరుమలకొండ||

చ|| వేదములే శిలలై వెలసినది కొండ| యేదెస బుణ్యరాసులే యేరులైనది కొండ|
గాదిలి బ్రహ్మాదిలోకముల కొనల కొండ| శ్రీదేవుడుండేటి శేషాద్రి కొండ||

చ|| సర్వదేవతలు మృగజాతులై చరించేకొండ| నిర్వహించి జలధులే నిట్టచరులైన కొండ|
వుర్విదపసులే తరువులై నిలచిన కొండ| పూర్వటంజనాద్రి యీ పొడవాటి కొండ||

చ|| వరములు కొటారుగా వక్కాణించి పెంచే కొండ| పరగు లక్ష్మీకాంతు సోబనపు గొండ|
కురిసి సంపదలెల్ల గుహల నిండిన కొండ| విరివైన దదివో శ్రీవేంకటపు గొండ||